క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



వేణుగోపాల్‌రావును సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది వేణుగోపాల్‌రావును శనివారం మాజీ కౌన్సిలర్ నడికూడ యాదగిరి యాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు న్యాయవాది కార్యాలయానికి వెళ్లి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పిప్పల వెంకటేశ్ యాదవ్, విశ్రాంత ఉపాధ్యాయులు మధుసూదన్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు

మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే సూచన



క్షతగాత్రులను అంబులెన్సులో ఎక్కిస్తున్న సిబ్బంది, పక్కన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: మండల పరిధిలోని కేసారం గేట్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్నాయి. దీంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తన వాహనాన్ని ఆపి, క్షతగాత్రులతో మాట్లాడారు. అనంతరం అంబులెన్సులో ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభం



తరగతులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను గ్రామ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉండాలనే ఉద్దేశంతో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహించే విధంగా కృషి చేసినట్టు తెలిపారు. తరగతులకు హాజరైన వారికి ఉచితంగా స్నాక్స్ అందిస్తామని పేర్కొన్నారు. తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లిష్ అధ్యాపకుడు శ్రీశైలం, గ్రామస్తులు వినస్నగారి రవీందర్, మల్లేశ్, శ్రీనివాస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలో చెత్తాచెదారం తొలగింపు



చెత్తాచెదారాలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: మండలంలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో గల మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, దీంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారనే విషయంపై నాలుగు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు శనివారం స్పందించారు. మురుగు కాలువలో నిండిన చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ డబ్బాలను జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో వ్యాపారులు, స్థానికులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

పకడ్బందీగా ఇళ్ల సర్వే

- గ్రామాల్లో అధికారుల క్షేత్ర పరిశీలన
- అర్హులను గుర్తించేందుకు పక్కా ప్రణాళిక



షాద్‌నగర్: ఇంటింటి సర్వే చేస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్



షాబాద్: లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ అపర్ణ, నాయకుడు మల్లేశ్

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించేందుకు రీ సర్వేను పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తేజస్వినితో కలిసి ఆయన ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద గూడులేని పేద వారికి పక్కా ఇంటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సర్వేను చేపట్టేందుకు ఆరుగురు గెజిటెడ్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఇల్లు ఎలా ఉంది, ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా, ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారా అనే వివరాలను తెలుసుకున్నారు. ఈ సర్వేను ఈ నెల 30వరకు పూర్తిచేసి అధికారులకు నివేదికను అందజేస్తామన్నారు. లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెండి మోహన్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు యూసఫ్‌మియా, బాలయ్య, శివ, రాజు, కారోబార్ శివ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేస్తామని ఎంపీడీఓ అపర్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లీ మహేశ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలిసి పలు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇళ్లు, వ్యవసాయ భూమి వివరాలు, ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలను వివరించారు. ఒక కుటుంబానికి చెందిన వారిలో ఒకరికే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రబియా సుల్తానా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్



దాత సర్వోత్తమ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, గ్రామస్తులు

నందిగామ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి ప్రముఖ రియాల్టర్ సర్వోత్తమ్ రెడ్డి తనవంతు సహాయంగా రూ. 27లక్షలను విరాళంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విరాళం అందజేసిన సర్వోత్తమ్‌రెడ్డి దంపతులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో అంజంగౌడ్, రాజుగౌడ్, మంకాల శ్రీశైలం, శివ, నరేందర్, కృష్ణయ్య,భాస్కర్, నిరంజన్‌గౌడ్, నర్సింహ, రవితేజ, వెంకట్‌చారి, నరేశ్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



చేవెళ్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

కొందుర్గు: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య విమర్శించారు. శనివారం చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బాల్‌రాజ్, చోటేమియా, వీరేషం, జంగయ్య, కమలమ్మ, నర్సమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: మండల కేంద్రంలో శనివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో 'మే'డే పోస్టర్‌ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

ఆలయ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి, కామరాతి దేవి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం గ్రామంలో ఆయన పలువురు సభ్యులు, కులపెద్దలతో కలిసి వేడుకలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బీరప్పస్వామి వేడుకలకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. కాగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నీటి వసతి, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు విజయ్, అజయ్, శ్రీశైలం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శంకర్‌పల్లి: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ సీఈఓ చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తాము చదువుకున్న రోజుల్లో జరిగిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్



మాట్లాడుతున్న ప్రశాంత్

షాద్‌నగర్: గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. మండల పరిధిలోని భీమారం గ్రామంలో శనివారం బీసీ సేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రశాంత్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో మహిళలు తమవంతు పాత్ర పోషించాలని తెలిపారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. బీసీ సేన ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సేన జిల్లా అధ్యక్షుడు శివ, నాయకులు శ్రీను, శేఖరప్ప, మారుతి, నియోజకవర్గ మహిళా కమిటీ అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, బాలమణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమ్య

షాద్‌నగర్: మానవ శరీరంలోని అన్ని అవయవాల కన్నా నేత్రాలు ఎంతో ప్రధానమైనవని కంటి వైద్యురాలు రమ్య అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి ప్రతినిధులు చందు, హరీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ గోసకు విముక్తి

మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి



సభ వాల్ పోస్టర్ల గోడలకు అతికిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

షాబాద్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాక కోసం రాష్ట్ర ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని చందనవెల్లి మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను వాల్స్‌పై అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అధినేత కేసీఆర్ చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో సముచితస్థానం ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు చారి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

షాద్‌నగర్: దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అందె బాబయ్య, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా హాజరై గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని మోదీ పాలనలో ప్రజలందరికీ సుపరిపాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుర్మయ్య, బూత్ అధ్యక్షుడు రాజు, అజయ్, సురేష్, అంజయ్యగౌడ్, శివకుమార్, శ్రవణ్, శ్రీశైలం, గణేష్, సురేష్, గోపాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.శ్రీవర్ధన్‌రెడ్డి విమర్శించారు. శనివారం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల మాల్‌లో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరు కలిసి పనిచేయాలన్నారు. దేశం కోసం మోదీ పాకిస్థాన్‌పై ఏ నిర్ణయం తీసుకున్న అందరూ అండగా ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంజన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కంజర్ల ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, కంజర్ల ప్రకాశ్, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, మోర నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడిని ఖండిస్తూ నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

చేవెళ్ల: పహల్గాం ఘటనలో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను పట్టుకొని, కఠినంగా శిక్షించాలని చేవెళ్ల బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా.. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య సంఘీభావం తెలిపి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, న్యాయవాదులు మధుసూదన్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, బాలస్వామి, మల్లేశ్, సురేశ్, యాదిరెడ్డి, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ ఖాజామోయిజుద్దీన్



డ్రైనేజీలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఆయన పర్యటించి మురుగు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపై మురుగు నీరు ఉండడం చూసి ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో ఎప్పటికప్పుడూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్మికులకు సూచించారు. రోడ్లపై చెత్త తొలగించాలని, ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సంధ్యారాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ ఫీడర్, తిమ్మాపూర్, ఎన్నార్ స్టీల్ ఫీడర్లలో మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు కొత్తూరు పట్టణం, తిమ్మాపూర్, కొత్తూరు తండా, చాకలిగుట్టతండాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.